సాక్షి
మంచిర్యాల

గురువారం। 29। జూన్। 2023



త్యాగానికి ప్రతీక బక్రీద్
హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకుంటారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనలకు జిల్లాలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి.
8లో▸

పెండింగ్ వేతనాలు చెల్లించాలి
చెన్నూర్: గిరిజన హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. బుధవారం చెన్నూర్‌లో కుమురం భీమ్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వారి సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 3న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
32.0 /26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

సర్వే నంబరే మార్చేశారు!



ఇళ్ల స్థలాలకు కేటాయిస్తూ ఇచ్చిన పట్టా



మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారు బొక్కల గుట్టలో ఏర్పాటు చేసిన వెంచర్

- తిమ్మాపూర్ శివారులో ఒకే నంబరు వేర్వేరు చోట్ల
- మహసుర భూమిని పట్టా భూములుగా మార్పు
- తాజాగా 11ఎకరాల్లో ప్లాటింగ్ చేస్తూ వెంచర్
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ శాఖలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మందమర్రి మండలం తిమ్మాపూర్ శివారులోని ఒకే సర్వేనంబరును వేర్వేరు చోట్ల చూపిస్తూ అటు అధికారులను.. ఇటు ప్రజలను బురిడీ కొట్టించారు. తిమ్మాపూర్ బొక్కల గుట్టలో సర్వేనంబరు 31లో అనేక అక్రమాలు జరిగాయి. ఈ సర్వేనంబరులో అటవీశాఖ(మహసుర)కు సంబంధించిన మొత్తం 2,966ఎకరాల భూమి ఉంటే అందులో 1985వ సంవత్సరంలో 40ఎకరాలు రెవెన్యూ శాఖకు బదిలీ చేశారు. ఈ భూమిలోనే 1986వ సంవత్సరంలో బొక్కలగుట్టకు చెందిన నిరుపేదలు ఇళ్లు కట్టుకునేందుకు రెండు గుంటల చొప్పున పట్టాలు ఇచ్చారు. ఆ సమయంలో అక్కడ అటవీ ప్రాంతంగా ఉండడంతో ఎవరూ నివాసం ఏర్పర్చుకోలేదు. దీన్ని ఆసరాగా చేసుకుని గ్రామంలో ఓ భూసామి సర్వే నంబరు 31 ఉరఫ్ 11 సర్వేనంబరులో ఐదున్నర ఎకరాల చొప్పున రెండు భాగాలుగా ఇద్దరు వ్యక్తులకు 11 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసి అమ్మేశారు. ఆ భూమి 31 సర్వేనంబరు అటవీశాఖకు సంబంధించినది కావడంతో ముందున్న 31 తొలగించి 11 సర్వేనంబరుగా చేర్చుతూ రెవెన్యూ రికార్డులకు ఎక్కించారు. ధరణి ప్రకారం కొత్త పాస్ పుస్తకాలు కూడా వచ్చాయి. కొనుగోలు చేసిన వారు సాగులో ఉన్నారు. దీనిపై ఇన్నాళ్లూ అభ్యంతరం వ్యక్తం చేయకపోవడంతో ఇదంతా వెలుగులోకి రాలేదు. రెండేళ్ల క్రితం నుంచి బొక్కల గుట్ట గ్రామస్తులు తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలు మళ్లీ తమకే కేటాయించాలని కోరారు. ఆ స్థలం వద్ద నిరసనలు చేపట్టారు. అదే సమయంలో అక్కడ పెద్దయెత్తున అటవీ, సర్కారు భూములు, పట్టాభూముల్లో ఆక్రమణలు జరుగుతున్న తీరుపై 'సాక్షి'లో కథనాలు వచ్చాయి. స్పందించిన అధికారులు సర్వే చేసి కబ్జాగురైన భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సర్వే నంబరులోనే కొందరు దళితులకు పట్టా భూములు సైతం వెలుగులోకి వచ్చాయి. తాజాగా 31/11 సర్వే నంబరులో ఏకంగా వెంచరు వేసి ప్లాట్లు చేసి అమ్మేందుకు రంగం సిద్ధం చేశారు.

ఒకే సర్వే నంబరు రెండు చోట్లా?

ఒక గ్రామ కంఠం పరిధిలో ఒకే సర్వేనంబరు రెండు చోట్ల ఉండదు. తిమ్మాపూర్ శివారులో ఒకే సర్వేనంబరు రెండు చోట్లా రికార్డుల్లోకి ఎక్కింది. 31/11సర్వే నంబరు తిమ్మాపూర్ శివారు బొక్కలగుట్ట గ్రామ పరిధిలో ఉంది. 11 సర్వేనంబరు తిమ్మాపూర్ శివారులో భీమా గార్డెన్ వెనకాల 1.23ఎకరాలు ఉంది. 31తీసేసి 11సర్వేనంబరుగా మార్పు చేసి రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేశారు. 1936 ప్రాంతంలో పహాని ఉన్నట్లు చూపిస్తూ రిజిస్ట్రేషన్లు చేసి ఇద్దరు వ్యక్తులకు అమ్మేసి ఓ డాక్యుమెంట్ రూపొందించారు. ఆ తర్వాతి కాలంలో భూ ప్రక్షాళన సమయంలోనూ ఆ రిజిస్ట్రేషన్ ఆధారంగానే కొత్త ధరణి పోర్టల్‌లోకి మారారు. ఇదంతా అప్పట్లో బొక్కలగుట్టకు చెందిన భూసామి చేసిన నిర్వాకమేనని గ్రామస్తులు చెబుతున్నారు. ఖాళీ జాగాను తమ భూమిగా మార్చుకునేందుకు ఏకంగా సర్వేనంబర్లను మార్చేసినట్లు చెబుతున్నారు. ఈ భూమికి సంబంధించిన పాత రికార్డులు అటూ రెవెన్యూ, ఇటు అటవీ శాఖ వద్ద లేకపోవడం గమనార్హం.

అనుమతులు ఇవ్వని మున్సిపాలిటీ

రామక్రిష్ణాపూర్ పట్టణ పరిధిలో విలీన గ్రామంగా ఉన్న బొక్కలగుట్టలోని సాగు భూమిలో ఏర్పాటు చేసిన వెంచరుకు మున్సిపాలిటీ నుంచి అనుమతి ఇవ్వలేదు. రెవెన్యూ నుంచి 'నాలా'(వ్యవసాయేతర భూమి)గా అనుమతులు తీసుకుని ప్లాటింగ్ ఏర్పాటు చేశారు. మొత్తం 11ఎకరాల్లో ప్లాటింగ్ చేస్తుండగా, బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉంది. గాంధారి ఖిల్లా వెళ్లే దారిలోనే ఉండడంతో భవిష్యత్తులో కాలనీలు ఏర్పడే అవకాశం ఉందని అమ్మకాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ భూమిలో వెంచరు ఏర్పాటు చేయడంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు వెళ్లాయి. రికార్డుల్లో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని రియల్ వ్యాపారం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ఒకరి సరెండర్.. మరో నలుగురిపై వేటుకు సిద్ధం?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'ఆర్టీఏలో వరుస దావత్‌ల జోరు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జిల్లా రవాణా శాఖ స్పందించింది. ఆదివారం ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో ఆర్టీఏ సిబ్బందితోపాటు ఏజెంట్లు కలిసి మందు, విందుతోపాటు పేకాడడం వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ కథనంపై డీటీఓ ఎల్.కిష్టయ్య స్పందించి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఒక హోంగార్డును సంబంధిత శాఖకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు చేశారు. ఇదే ఘటనలో మరో నలుగురిపై కూడా చర్యలు తీసుకునేలా విచారణ వేగవంతం చేశారు. పూర్తిస్థాయి విచారణలో వారి ప్రమేయం స్పష్టంగా తేలితే మరో వారం రోజుల్లో ఆ నలుగురిపై వేటు పడే అవకాశం ఉంది.

హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: హరితహారం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్‌తో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి, అటవీశాఖలు, పురపాలక సంఘాలు, పరిశ్రమలు, సింగరేణి అధికారులతో హరితహారం లక్ష్యాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన వాయువుతోపాటు సమతుల్య వాతావరణం అందించి ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరి తహారం కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. జిల్లాలో 44 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా కేటాయించిందని వివరించారు. జిల్లాలో శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, సింగరేణి, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

చెన్నూర్‌రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని అంగ్రాజ్‌పల్లి గ్రామ పీహెచ్‌సీని బుధవారం ఆయన పరిశీలించారు. ఓపీ రిజిష్టర్లు, రోగులకు వైద్య సేవలపై తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ఏఎన్‌ఎంల సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. పీఓ డాక్టర్ ఫయాజ్‌ఖాన్, పీహెచ్‌సీ వైద్యుడు ముస్తఫా, హెచ్‌ఈవో జగదీశ్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- 357 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న విప్ బాల్క సుమన్

రామకృష్ణాపూర్: రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో బుధవారం 357 మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మెరుగైన పాలన కొనసాగాలంటే కేసీఆర్ సర్కార్‌ను ప్రజలు మళ్లీ దీవించాలని అన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఆశీస్సులతో అన్ని రంగాల్లో అద్భుత ప్రగతిని సాధిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ నేతల మోసపూరిత హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, జెడ్పీటీసీ వేల్పుల రవి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

357 మంది సర్టిఫికేట్ల పరిశీలన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ కేంద్రంలో బుధవారం టీఎస్ ఎంసెట్-2023లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎన్‌రోల్ చేసుకుని వరుస క్రమంలో సర్టిఫికేట్లను పరిశీలించారు. 357 మంది సర్టిఫికేట్లను అధికారులు పరిశీలించి ధ్రువీకరించారు. సదరు విద్యార్థులకు కౌన్సెలింగ్ చేసినట్లు ప్రభుత్వ పాలిటెకినక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటించారు.

కార్పొరేషన్ దిశగా మంచిర్యాల

- అప్‌గ్రేడ్ చేసేలా ప్రణాళికలు
- సమీప మున్సిపాల్టీల విలీనం



మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసే దిశగా ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. గ్రేడ్1 మున్సిపాలిటీగా ఉన్న జిల్లా కేంద్రం మంచిర్యాలలో నస్పూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీలు, హాజీపూర్ మండలం వేంపల్లి వరకు విలీనం చేస్తూ కార్పొరేషన్ హోదా ఇచ్చేందుకు ప్రణాళికలు వేస్తోంది. 2019లోనే రాష్ట్రంలో కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు సమయంలో మంచిర్యాలను కార్పొరేషన్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. స్థానికులు, రాజకీయ నాయకుల నుంచి వ్యతిరేకత రావడంతో ముందడుగు పడలేదు. పారిశ్రామిక ప్రాంతంగా పేరొందిన ఈ ప్రాంతం దినదినం పెరుగుతున్న జనాభాతో వేగంగా విస్తరిస్తోంది. పట్టణానికి సరిపడా సౌకర్యాలు కల్పించాలంటే కార్పొరేషన్ స్థాయికి పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ క్రమంలో మంచిర్యాల పట్టణంలో సమీప పట్టణాలు, గ్రామాలను విలీనం చేస్తూ అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. వచ్చే ఎన్నికలకు ముందే కార్పొరేషన్ ఏర్పాటుకు గెజిట్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతమున్న పట్టణం 36వార్డులు, సుమారు రెండు లక్షల జనాభాతో ఉంది. మంచిర్యాలకు ఆనుకునే నస్పూర్ పట్టణంలోని 25 వార్డుల్లో లక్ష వరకు జనాభా ఉంది. ప్రస్తుతం కొత్త కలెక్టరేట్, పలు ప్రభుత్వ భవనాలు ఇక్కడే ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న మరో పట్టణం క్యాతనపల్లి. ఈ మున్సిపాలిటీ సైతం జిల్లా కేంద్రానికి గద్దెరాగిడి దాదాపు కలిసి పోయే ఉన్నాయి. 22వార్డులతో 50వేలకు పైగా జనాభా ఉంది. వేంపల్లి వరకు పట్టణీకరణ జరిగింది. ఈ క్రమంలోనే కార్పొరేషన్ ఏర్పాటు దిశగా సర్కారు ప్రణాళిక వేస్తోంది. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తే ప్రస్తుతమున్న వార్డులు డివిజన్లుగా, కౌన్సిలర్ల స్థానంలో కార్పొరేటర్లు, చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాల్లో మేయర్, డిప్యూటీ మేయర్లు ఉంటారు. పన్నుల వసూళ్లు, అభివృద్ధికి నిధులు, నిర్మాణాల అనుమతులు అన్ని కార్పొరేషన్ స్థాయిలో ఉంటాయి.

బ్లడ్‌బ్యాంక్‌కు స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకుకు స్థలం కేటాయించాలని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులతో జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, సభ్యులు రాధాకృష్ణ, కాసర్ల శ్రీనివాస్, సత్యపాల్‌రెడ్డి, ఎడ్ల కిషన్ పాల్గొన్నారు.

తరగతి గదుల్లోనే విద్యార్థుల భవిష్యత్

బెల్లంపల్లి : విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అదనపు కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులతో కూర్చుని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విన్నారు. తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం కోసం 30 పోస్టులకు గాను 84మంది డెమోకు హాజరైనట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీఓ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు డెమోలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, ఎంపీడీవో రాజేందర్, సంక్షేమ గురుకులాల ప్రిన్సిపాల్స్ స్వరూప, లలిత కుమారి, ఊటూరి సంతోష్‌కుమార్, ప్యానల్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు



బోనాల జాతరలో ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: ఆషాఢమాసం పురస్కరించుకుని బుధవారం స్థానిక హమాలీవాడలో బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. స్థానిక అభయాంజనేయ సాయి దేవాలయం నుంచి కట్టపోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. డప్పుచప్పుళ్ల మధ్య భక్తుల పూనకాలు, జోగిని శ్యామల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కట్టపోచమ్మకు బోనాలు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావుతోపాటు పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. నల్లకోటమ్మ-లక్ష్మయ్య ట్రస్టు చైర్మన్ నల్ల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, బీఆర్‌ఎస్ యువనాయకుడు విజిత్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సుకు కృషి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల బలోపేతం, విద్యార్థుల శ్రేయస్సు కోసం కృషి చేద్దామని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో, ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు క్షేత్రస్థాయిలో విద్య కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఎంఈవో, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

టమాటా రూ.100

- కూరగాయల ధరలు భగభగ
- కోడి కూర కొనలేం.. కోడిగుడ్డు తినలేం
- సామాన్యులపై ధరాఘాతం
- మూడు నెలల్లో మూడింతలు పెరిగిన ధరలు



జన్నారంలో కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

గత మూడు నెలల్లో కూరగాయల ధరలు(రూ.లలో)

కూరగాయలు	ఏప్రిల్	మే	జూన్
టమాటా	20-30	30-40	80-100
పచ్చిమిర్చి	40	50-60	80-100
చిక్కుడు	20	60	80-100
గోరు చిక్కుడు	20	50	50-60
కాకర	30	50	60-70
వంకాయ	20	30-40	60-70
బెండకాయ	20	20-30	50-60
ఆలుసంద	20	40	60-70
ముల్కాయ	50	60	90-110
దొండకాయ	20	30	60-80
ఆలుగడ్డ	20	25	30
క్యారెట్	30	50	80

మంచిర్యాలఅగ్రికల్చర్/జన్నారం: కిలో టమాటా రూ.100కు చేరింది. కిలో చికెన్ ధర రూ.300కు చేరింది. దీంతో సామాన్య ప్రజలు ఏమీ కొనలేని.. తినలేని పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు మార్కెట్‌లో భగభగ మండిపోతున్నాయి. ఏ కూరగాయలు కొనాలన్నా ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా చుక్కలనంటాయి. ఆదివారం వచ్చిందని చికెన్ తినాలనుకుంటే ధరలు కొండెక్కాయి. కిలో స్కిన్‌లెస్ రూ.300 నుంచి రూ.320కి చేరింది. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలూ మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా కోడి, కోడిగుడ్ల ధరలు పెరిగాయి. ప్రతీ ఇంట్లో ఏ కూరగాయ వండినా అందులో టమాటా, పచ్చిమిర్చి వేయడం తప్పనిసరి. ధరలు పెరగడంతో గృహిణులు వినియోగాన్ని సగానికి తగ్గించారు. గత నెల వరకు కిలో రూ.40 వరకు ఉన్న టమాటా ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100కు చేరింది. వేసవి కాలం జిల్లాలో టమాటా, మిర్చి పంట సాగు లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్లో కిలో పచ్చిమిర్చి రూ.100 పలుకుతోంది. దూర ప్రాంతాల నుంచి దిగుబడి చేసుకుంటుండడంతో టమాటా, పచ్చిమి ర్చి ధరలకు రెక్కలొచ్చాయి. పచ్చిమిర్చికి బదులు గా ఎండుమిర్చి కారంతోనే కూరలు వండాల్సి వ స్తుందని మహిళలు వాపోతున్నారు. బోరుబావుల కింద నీటి సౌకర్యం ఉన్న రైతులు అరకొర సాగు చే సిన మిర్చి రైతులకు ప్రస్తుతం మంచిధర లభిస్తోంది.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

జిల్లాలో యాసంగి డిసెంబర్, జనవరి నెలలో 438 ఎకరాల్లో టమాటా, 627 ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంట దిగుబడి వచ్చి మార్కెట్లోకి ఎండుమిర్చిగా వస్తోంది. వేసవి సీజన్‌లో సాగు విస్తీర్ణం లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌తోపాటు రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా, నిజామాబాద్ తదితర దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎండల కారణంగా దిగుబడి తగ్గడం, రవాణా చార్జీలు పెరగడం, అరకొరగా మార్కెట్‌కు వస్తుండడంతో ధరలు అమాంతం పెరిగాయి. మరో నెల రోజుల వరకు టమాటా, మిర్చి ధరలు వందపైనే ఉంటాయని మారుబేరం వ్యాపారులు చెబుతున్నారు.

కోళ్లు ఇతర ప్రాంతాల నుంచే..

హోల్‌సేల్‌లో ఒక కోడి గత నెలలో రూ.100 నుంచి రూ.200కు రాగా, ఈ నెల రెండో వారం నుంచి రూ.170 నుంచి రూ.180కి పెరిగినట్లు చికెన్ వ్యాపారులు తెలిపారు. కోడిగుడ్డు ధర గత నెల రూ.5 ఉండగా, ప్రస్తుతం రూ.7కు చేరింది. జిల్లాలో చిన్న పెద్ద కోళ్లఫారాలు 36 ఉండగా 11 వరకు మాత్రమే నిర్వహణలో ఉన్నాయి. జిల్లాలోని కోళ్ల పరిశ్రమలు మూతపడడంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ దూర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి. దూర ప్రాంతాలు, డీసీఎం వాహనాల్లో తరలిస్తున్న కోళ్లకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో రోజుకు 3 నుంచి 4 టన్నుల వరకు చికెన్ విక్రయాలు సాగుతున్నాయి. శుభకార్యాల సమయంలో మరో రెండు మూడు టన్నుల వరకు అదనంగా విక్రయాలు సాగుతున్నాయి. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో కిలో రూ.300 ఇంకొన్ని చోట్ల రూ.320 వరకు విక్రయిస్తున్నారు. ఆషాఢ మాసం కావడంతో గ్రామదేవతలు, అమ్మవార్లకు మొక్కులు అధికంగా ఉండడంతో కోళ్ల విక్రయాలు పెరిగాయి. మార్కెట్ అవసరాల మేరకు కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. మరో నెలన్నర రోజులపాటు కోళ్ల ఉత్పత్తి తక్కువగా ఉంటుంది.

బాక్స్ రూ.2000

పోయిన నెల వరకు ట మాటా పెట్టె(20 కిలోలు) రూ.900 నుంచి రూ.1100 వచ్చింది. ఇప్పుడు రూ.2000 ధరతో కొనుగోలు చేయాల్సి వస్తుంది. పెట్టెలో రెండు మూడు కిలోల వరకు పాడైపోతున్నాయి. కిలో రూ.100 చొప్పున టమాటా, మిర్చి అమ్మాల్సి వస్తుంది. జిల్లాలో ట మాటా, మిర్చి, ఇతర కూరగాయల రైతులు తీ సుకొచ్చే వారు. ఇప్పుడు తెస్త లేరు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వాటికి ధర ఎక్కువగానే ఉంటుంది.
– సుగుణ, కూరగాయల మారువ్యాపారి

కొనలేకపోతున్నాం..

గత పదిహేను రోజులు గా మార్కెట్లో టమాటా, పచ్చిమిర్చి కొనలేనంతగా ధర పెరిగింది. కిలో టమాటా, మిర్చి రూ.60 ఉన్న ధర ఇప్పుడు రూ.100 అయ్యింది. టమాటా, పచ్చిమిర్చి కూరలో వేయందే రుచిగా ఉండదు. పెరిగిన ధర వల్ల టమాటా, పచ్చిమిర్చి లేకుండా ఎండు మిర్చితోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.
– సరిత, గృహిణి, మంచిర్యాల

కిలోకు బదులు అరకిలోనే..



ఆదివారం వచ్చిందని కిలో చికెన్ కొందామని మార్కెట్‌కు పోతే పెరిగిన ధర చూసి అరకిలోతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత నెల స్కిన్ చికెన్ రూ.200 ఉంటే ఇప్పుడు రూ.300 అంటున్నారు. ఈ ధర ఎప్పుడు చూడలే. మటన్ కిలో రూ. 800 ఉన్నది చికెన్ తక్కువగా వస్తుందనుకుంటే చికెన్ ధర బాగా పెరిగిపోయింది.
– మినుగు హరిబాబు, బెల్లంపల్లి,

కోడి ధర పెరిగింది..



పోయిన నెల హోల్‌సేల్ కోడి ధర రూ.100 ఉంటే ఈ నెల 180కి చేరింది. మహారాష్ట్ర నుంచి కోళ్లు వస్తున్నాయి. అక్కడ కోళ్ల ఫాంలకు ఏసీలు, కూలర్లు పెట్టి పెంచుతుండ్రు. దూరం ప్రాంతం నుంచి డీసీఎం వ్యాన్లలో వస్తున్నాయి. హోల్‌సేల్ ధరలు పెరగడంతో చికెన్ ధరలు పెంచి అమ్మాల్సి వస్తుంది. గతంలో కంటే గిరాకీ తక్కువగానే ఉంది.
– రవి, చికెన్ వ్యాపారి, బెల్లంపల్లి

కారంపొడితో వెల్లదీస్తున్న



మార్కెట్‌లో కూరగాయల ధరలు అమాంతం పెరిగి పోయాయి. వారానికోసారి మార్కెట్‌కు వెళ్లి రూ.200 కూరగాయలు తెచ్చుకునేది. ఇప్పుడు రూ.200కు రెండు, మూడు రకాల కూరగాయలు వస్తున్నాయి. మిర్చి ధర పెరగడంతో కూరగాయల వంటలో కారంపొడి వేసుకుని వెల్లదీస్తున్న. కూరగాయల ధరలతో కొనలేని పరిస్థితి ఏర్పడింది.
– సిరికొండ లక్ష్మి, గృహిణి, జన్నారం

వ్యాపారం చేయలేకపోతున్నాం



గత పది రోజులుగా కూ ర గాయల ధరలు అ మాం తం పెరిగాయి. రో జు కరీంనగర్, జగి త్యాల, ఆదిలాబాద్ ప ట్టణాలకు వెళ్లి కూరగా యలు తెచ్చుకుని ఇక్కడ రోజు అమ్మే వారికి హోల్‌సేల్‌లో ఇస్తాను. మిర్చి ఇప్పుడు ఆంధ్ర, సోలాపూర్ నుంచి తెప్పించాల్సి వస్తుంది. టమాటా పెట్టెకు రూ.2 వేల వరకు అవుతుంది. నష్టపోతున్నాం. అందుకే వ్యాపారం చేయలేకపోతున్నాం.
– రజాక్, వ్యాపారి, జన్నారం

క్లుప్తంగా

మద్యానికి బానిసై బాలుడి ఆత్మహత్య

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సత్యసాయి నగర్ కాలనీకి చెందిన బాలుడు మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం... శివసాయి(16) కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినకుండా మద్యం సేవించేవాడు. మంగళవారం సైతం అతిగా మద్యం తాగి రాగ కుటుంబ సభ్యులు మందలించడంతో రాత్రి ఇంటి ఆవరణంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి రామ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని ధనోరా అటవీ ప్రాంతంలో బుధవారం కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు జోడేఘాట్ ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. ధనోరా అడవి నుంచి జింక రోడ్డుపైకి రావడంతో గమనించిన గ్రామ కుక్కలు వెంబడించి దాడి చేశాయి. దీంతో జింక మృతి చెందింది. తర్వాత ధనోరాలోనే దహనం చేసినట్లు జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎఫ్ఎస్‌వో మల్లయ్య, బీట్ అధికారి భూంరావు ఉన్నారు.

ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న పెన్షన్‌దారులు

నస్పూర్: తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల జేఏసీ ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు కే ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. బకాయి ఉన్న రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పెన్షన్‌ని ప్రతీ నెల ఒకటవ తేదీన అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 12న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి చక్రధర్‌రావు, కార్యదర్శి కేఎంఎస్ రెడ్డి, సభ్యులు రవిశంకర్, జనార్దన్ చంద్రశేఖర్, రాయలింగు పాల్గొన్నారు.

మోసపోయిన యువకుడు

బెల్లంపల్లి: వాట్సాప్ గ్రూపు మెస్సెజ్‌కు స్పందించి బెల్లంపల్లికి చెందిన ఓ యువకుడు మోసపోయిన వైనం బుధవారం వెలుగు చూసింది. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి పోస్టాఫీసు బస్తీలో నివాసం ఉంటున్న రాకేష్ పాండే అనే యువకుడు ఇండియన్ పోస్టు పేమెంట్ వాట్సాప్ గ్రూపులో యాడ్ అయ్యాడు. ఇటీవల ఆ గ్రూపులో గుర్తు తెలియని వ్యక్తి యూఎల్‌సీ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు మెస్సెజ్‌ను పోస్టుచేశాడు. స్పందించిన రాకేష్ పాండే సదరు వ్యక్తికి ఫోన్‌చేసి తనకో యూఎల్‌సీ కేంద్రం కావాలని అభ్యర్థించాడు. ఇందుకు సదరు వ్యక్తి డబ్బులు చెల్లించాలని చెప్పడంతో రాకేష్ రూ.13,001 పే చేశాడు. మళ్లీ రూ.9వేలు చెల్లించాలని సదరు వ్యక్తి కోరడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా మోసపోయినట్లు గ్రహించాడు. బుధవారం వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు బక్రీద్ పర్వదినం
- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు



ఆదిలాబాద్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

నెన్నెల/ఉట్నూర్‌రూరల్/కెరమెరి: హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు నిర్వహించుకుంటారు. దీనినే ఈద్ ఉల్ జుహా అని కూడా అంటారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజున పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇస్లాం మానవాళికి నిర్దేశించిన విధి విధానాల్లో ఐదో విధి మక్కా యాత్ర చేయడం, జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని పేదలకు పంచడం, రెండు రకాతులుగా నమాజ్‌లు ఆచరించడం ఈ పండుగ ప్రత్యేకత. గురువారం బక్రీద్ పండుగ నమాజ్ కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులు ముస్తాబు చేశారు. ఆదిలాబాద్‌లోని ఈద్గా వద్ద ఎమ్మెల్యే జోగు రామన్న, ఏర్పాట్లను పరిశీలించారు.

ఖుర్బానీ తప్పనిసరి

ఇబ్రహీం త్యాగనిరతిని మెచ్చి బక్రీద్ పండుగ రోజు జంతుబలి ఇవ్వాలని, ఈ విధానాన్ని ప్రళయం వరకు కొనసాగించాలని నిర్దేశించినట్లు ఇస్లాం చెబుతోంది. ఎవరి వద్దయితే యాభైరెండున్నర తులాల వెండి.. ఏడున్నర తులాల బంగారం లేదా ఆ మేరకు డబ్బు ఉంటుందో వారిపై ఖుర్బానీ తప్పనిసరి అవుతుంది. ఈ మేరకు ముస్లింలు బక్రీద్ రోజున పెద్ద ఎత్తున జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

ప్రత్యేక ప్రార్థనలు

ముస్లింలు ఈద్ నమాజ్‌లు ఊరిబయట మైదానంలోని ఈద్గాల్లో చేయాలని నియమం. నమాజ్ ఆచరణకు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఈద్గాలకు వెళ్లలేని తరుణంలో సమీప మసీదుల్లో నమాజ్ చేయనున్నారు.

బక్రీద్ రోజున మక్కా యాత్ర

ఇస్లాం విధి విధానాల్లో ఐదో విధానమైన హజ్(మక్కాయాత్ర) ఇదే రోజున మక్కాలో జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ముస్లింలు మక్కా మసీదులోని కాబా దర్శనం చేసుకుంటారు. 40 రోజుల హజ్ యాత్రలో భాగంగా మక్కా మదీనాల్లో నమాజ్ ఆచరిస్తూ శైతాన్‌కు రాళ్లు వేసే ప్రక్రియలో పాల్గొంటూ దైవారాధనలో గడుపుతారు.

మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు



ముస్లింలు అల్లా ఆదేశాలను పాటిస్తూ పండుగ వేడుకలు జరుపుకుంటారు. వర్షాకాలం దృష్ట్యా వర్షాలు కురుస్తుండటంతో ఈద్గాల వద్ద సౌకర్యాలను బట్టి నమాజ్ చేయడం జరుగుతుంది. వర్షం వల్ల ఆటంకాలు వస్తే తమ తమ సమీప మసీదుల్లో నమాజ్ చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో జరుపుకోవాలి.

– కలీం, మౌలానా జామా మసీద్, ఉట్నూర్

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



చోరికి పాల్పడిన నిందితులతో పోలీసులు

తిర్యాణి: ఈనెల 26న మండల కేంద్రంలోని సహకార బ్యాంక్‌లో చోరీకి యత్నించడంతో పాటు మండల కేంద్రానికి చెందిన సకారం అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్ గ్రామానికి చెందిన సామ రాకేశ్‌రెడ్డి, తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన గేడం శ్రీనివాస్ అనే ఇద్దరూ మిత్రులు ఈ నెల 26న మంచిర్యాలలో కలుసుకుని మద్యం సేవించారు. అనంతరం ఈజీగా మనీ సంపాదించాలనే ఉద్దేశంతో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో మండల కేంద్రానికి చేరుకుని, రాత్రి 11:30 గంటల సమయంలో సహకార బ్యాంకు లూటి చేసేందుకు యత్నించగా డబ్బులు భద్రపర్చిన లాంకర్‌లు తెరుచుకోకపోవడంతో ఎదురుగా ఉన్న సకారం అనే వ్యక్తి కి చెందిన ఇంటికి తాళం వేసి ఉండడాని గమనించి ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారంతో పాటు రూ.12వేల నగదును దొంగిలించారు. బుధవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించగా కన్నెపెల్లి బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందిఉతలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను రద్దు చేయాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ సీతారామయ్య



మాట్లాడుతున్న వీ సీతారామయ్య

శ్రీరాంపూర్: ఎన్నికలు వద్దనుకుంటే కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ సీతారామయ్య తెలిపారు. బుధవారం ఆయన నస్పూర్– శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల నిర్వహించాలని ఏ మాత్రం లేదన్నారు. ఎన్నికలు నిర్వహించకుంటే యాజమాన్యానికి మేలు జరుగుతుందన్నారు. కార్మికులు మాత్రం సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. యజమాన్యం, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ రెండు కలిసి కోర్టుకి వెళ్లడం వల్లే ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఎన్నికల నిర్వహిస్తే ఓడిపోతామనే భయంతో రాష్ట్ర సర్కార్ కావాలని జాప్యం చేస్తుందని తెలిపారు. గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి రెండేళ్లయినా, నాలుగేళ్లయినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బయట జరిగే కార్యక్రమాలకే కాకుండా మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ, ఏరియా కమిటీ, స్ట్రక్చరల్, జేసీసీ మీటింగ్‌లకు కూడా అన్ని సంఘాల నాయకులను పిలవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు గునిగంటి నరసింహారావు, అఫ్రోజ్ ఖాన్, సారయ్య పాల్గొన్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతి అందించాలి

- గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో 516 మొక్కలు నాటిన డైరెక్టర్ బలరాం



ఐకే–ఓసీపీపై మొక్కలు నాటుతున్న డైరెక్టర్ బలరాం, నాయకులు

జైపూర్: బాధ్యతతో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలని సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్.బలరాం తెలిపారు. జైపూర్ మండలం ఇందారం ఓపెన్‌కాస్టు గని ఆవరణలో బుధవారం గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా డైరెక్టర్ బలరాం ఒక్కడే 516 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఐకే – ఓసీపీపై మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ అనేక మొక్కలను నాటుతూ వాటిని రక్షిస్తూ ముందుకు వెళ్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలను నాటాలని సూచించారు. ఇప్పటి వరకు 15వేలా 789 మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న డైరెక్టర్ బలరాం అన్ని ఏరియాల్లో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడంపై చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐకే–ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, గని మేనేజర్ బ్రహ్మాజి, నాగన్న, ప్రాజెక్టు ఇంజినీర్ రమేష్, టీబీజీకేఎస్ నాయకులు పెట్టం లక్ష్మణ్, కుమారస్వామి, జగదీశ్వర్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శులు గడ్డం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని భార్య మృతి

బెల్లంపల్లి: కట్టుకున్న భర్త కాపురానికి తీసుకెళ్లడం మనస్తాపానికి గురైన ఓ మహిళ అనారోగ్యం పాలై మృతిచెందింది. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య కథనం ప్రకారం.... బెల్లంపల్లి భూడిద గడ్డ బస్తీకి చెందిన అయిల్ల విజయ, మల్లేష్ దంపతుల కుమార్తెను చైతన్యను 2017లో వైజాగ్‌కు చెందిన కవ్వంపల్లి నరేష్‌తో పెళ్లి చేశారు. పెళ్లైన రెండు నెలల తరువాత అదనపు కట్నం రూ.2లక్షలు తీసుకురావాలని భర్త, అత్తమామ లక్ష్మి, మల్లయ్యలు వేధించి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. పుట్టింటికి వచ్చిన చైతన్య భర్త కాపురానికి తీసుకెళ్లకపోవడంతో తీవ్ర మానసిక వేదనతో అనారోగ్యం పాలై ఇటీవల మృతిచెందింది. బుధవారం మృతురాలి తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సివిల్స్ ప్రిలిమినరీ శిక్షణకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ 10 నెలల రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్ష హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లో జులై 9వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. 75సీట్లు షెడ్యూల్డ్ కులాల వారికి, 15 సీట్లు వెనుకబడిన తరగతుల వారికి, 10 సీట్లు షెడ్యూల్డ్ తెగల వారికి కేటాయించినట్లు వివరించారు. మొత్తంలో 33.33 శాతం మహిళలకు, 5శాతం దివ్యాంగులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి, అర్హత గల పట్టభద్రులు రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష కోసం జులై 2వ తేదీలోగా ఆన్‌లైన్‌లో www.tsstudycircle.co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కేయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీతో సహా ఇతర పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం తెలిపారు. జూలై 1న గ్రూప్–4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని తెలిపారు. మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

తండ్రి, అన్నావదినలపై కేసు..

- ఆడపడుచును చితకబాదిన పుట్టింటివారు..

బెల్లంపల్లి: ఆడపడుచును చితకబాదిన అన్నావదిన, తండ్రిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... బెల్లంపల్లి బూడిదగడ్డ బస్తీకి చెందిన గుండారపు శ్యామల, సతీష్‌కుమార్ భార్యభర్తలు. శ్యామల తన ఆడపడుచు గుండారపు శరణ్యకు గతేడాది నవంబర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన గొట్టే నాగరాజు అనే యువకుడిని పెళ్లి చూపులకు తీసుకురాగా శరణ్య నిరాకరించింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా శరణ్య పెళ్లి చూపులకు వచ్చిన నాగరాజును ప్రేమించి గత ఫిబ్రవరిలో పెళ్లి చేసుకుంది. పెళ్లైన తర్వాత నాగరాజుకు శ్యామల ఫోన్ చేసి శరణ్య గురించి చెడుగా చెప్పింది. దీంతో నాగరాజు భార్యను వేధించడం మొదలుపెట్టాడు. ఈ నెల 23న శరణ్య పుట్టింటికి రాగా సోదరుడు సతీష్‌కుమార్, వదిన శ్యామల ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని గొడవ పెట్టడడంతో బాధితురాలు అదేరోజు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న అన్న, వదినలతో పాటు తండ్రి ధర్మయ్య శరణ్యను బుధవారం చితకబాదారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు.

అదనపు కట్నం కేసు నమోదు

బెల్లంపల్లి: అదనపు వరకట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు బుధవానం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కన్నాల బస్తీకి చెందిన కుశ్నపల్లి హర్ష ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన కోమిడి ప్రవీణ్‌తో గత ఫిబ్రవరిలో పెళ్లి చేశారు. పెళ్లైన రెండోరోజు నుంచే భర్త ప్రవీణ్, అత్త తారాబాయి అదనపు వరకట్నం రూ.10లక్షలు తీసుకురావాలని వేధించడం ప్రారంభించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చెప్పారు.

గిరిజన ఆణిముత్యం

- నీట్‌లో ఆల్‌ఇండియా ఎస్టీ కోటాలో 2,782 ర్యాంక్
- కూలీ పనిచేస్తూ చదివించిన తల్లి
- తొమ్మిదో తరగతిలో తండ్రి మృతి..



తల్లి బుచ్చక్కతో స్రవంతి

దహెగాం: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది ఓ కూలీ కూతురు. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా తల్లి కూలీ పనులు చేసుకుంటూ కూతుర్ని చదివించింది. తండ్రి క్యాన్సర్‌తో ఐదేళ్ల క్రితం మృతిచెందడంతో ఆ పసి మనసులో అప్పటి నుంచే డాక్టర్ కావాలని తలపించింది. మా నాన్నలాగా ఎవరు మృతిచెందవద్దనే ఉద్దేశంతో పట్టుదలతో చదివి ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో 427 మార్కులు సాధించగా ఎస్టీ కోటాలో 2,782 ర్యాంక్ కైవసం చేసుకుంది. కొలవార్ తెగలో వైద్య విద్యను పూర్తి చేస్తే తొలి విద్యార్థిని సంగర్ష్ స్రవంతి కానుంది.

కుటుంబ నేపథ్యం..

కుమురంభీం జిల్లా దహెగాం మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన సంగర్ష్ శంకర్, బుచ్చక్కలకు ఐదుగురు ఆడపిల్లలే. అందులో ఐదో సంతానమైన స్రవంతి 1 నుంచి 5వ తరగతి వరకు చంద్రపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివింది. 6 నుంచి 10వ తరగతి వరకు దహెగాంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చదివింది. పదిలో 8.2 జీపీఏ సాధించింది. 9వ తరగతి చదువుతున్న క్రమంలో తండ్రి శంకర్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. శంకర్‌కు సరైన వైద్యం అందక చనిపోయాడని ఇరుగుపొరుగు వారు అనేవారు. అప్పుడే ఆమెలో డాక్టర్ కావాలనే ఆలోచన మొదలైంది. దీంతో బంధువుల సహకారంతో డీఆర్‌డీఏను సంప్రదించి హైదరాబాద్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో సీటు సాధించింది. ఇంటర్ బైపీసీలో 934 మార్కులు సాధించింది.

కుంగిపోకుండా చదివి..

ఇంటర్ పూర్తి చేసిన స్రవంతి డాక్టర్ కావాలని కోరిక ఉండగా ప్రైవేటులో నీట్ శిక్షణ తీసుకునే ఆర్థిక స్తోమత లేక గిరిజన శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌రాల్డ్‌లో నీట్ శిక్షణ తీసుకుంది. మొదటి ప్రయత్నంలో నీట్‌లో సీటు కోల్పోయింది. అయినా కుంగిపోకుండా అధైర్యపడకుండా పట్టుదలతో చదివి రెండోసారి 427 మార్కులు సాధించి ఎస్టీ కోటాలో 2,782 ర్యాంకు సాధించి వైద్య విద్యకు ఎంపికైంది. వైద్య విద్య పూర్తి చేస్తే తెలుగు రాష్ట్రాల్లో కొలవార్ తెగలో మొదటి మహిళగా గుర్తింపు పొందే అవకాశం ఉంది.

నా బిడ్డను డాక్టర్‌గా చూడాలనుకున్నా

నా భర్త ఐదు సంవత్సరాల క్రితం చనిపోయిండు. నాకు ఐదుగురు ఆడపిల్లలే. నలుగురు పిల్లల పెండ్లీలు చేసినా. స్రవంతి ఐదవ బిడ్డ ఆమె చిన్నప్పటి నుంచి మంచిగ చదువుకుంటుంది. స్రవంతిని డాక్టర్ చదివించాలని నా కోరిక నేను కూలీ పనులు చేసుకుంటు ఆమెను చదివిపిచ్చినా మేము కష్టపడినట్లు నా బిడ్డ కష్టపడవద్దని ఆమెను చదివిపించి డాక్టర్ చేయాలని అనుకున్న. స్రవంతి డాక్టర్ అయితదని అందరు అంటురు. నాకు ఆనందంగా ఉంది.

– బుచ్చక్క, స్రవంతి తల్లి, చంద్రపల్లి

పేదలకు వైద్యం అందిస్తా

సరైన వైద్యం అందక మా నాన్న చనిపోయినట్లు ఊర్లో అందరూ అనేవారు. అప్పటి నుంచే డాక్టర్ కావాలని అనుకున్న. కష్టపడి చదివితే సాధించవచ్చని అనుకుని నీట్ మొదటి సారి రాస్తే ర్యాంక్ రాలేదు. అయినా బాధపడకుండా రెండో సారి కోచింగ్ తీసుకుని ప్రయత్నం చేయగా ఎస్టీ కోటాలో 2,782 ర్యాంకు వచ్చింది. తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివించారు. నాన్న లేకపోయినా అమ్మ నాకు ధైర్యం చెప్పింది. నిరుపేదలకు వైద్యం అందిస్తా.

– స్రవంతి, చంద్రపల్లి

ఉమ్మడి జిల్లాకు రూ.82.86కోట్లు

- ప్రత్యేక రుణ సాయానికి కేంద్రం ఆమోదం
- వైద్యం, రోడ్డు రవాణా మెరుగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం అందించనున్న మూలధన పెట్టుబడుల వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు రూ.82.86కోట్ల రుణాలకు ఆమోదం తెలిపింది. 2023–24ఆర్థిక సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు మూలధన వ్యయాన్ని అందించేందుకు 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్' పథకం ద్వారా 50ఏళ్ల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వనుంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం రూ.2,102 కోట్ల మూలధన పెట్టుబడుల ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదించింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి వైద్యం, రహదారి ప్రాజెక్టులకు రుణం మంజూరు కావడంతో ఆ మేరకు అభివృద్ధి జరగనుంది. ఆమోదించిన ప్రాజెక్టుల్లో ఆసిఫాబాద్‌లోని జిల్లా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిలో వంద ఎంబీబీఎస్ సీట్ల కల్పన కోసం రూ.9.50కోట్లు, నిర్మల్ జిల్లా ఆసుపత్రి అప్‌గ్రేడ్ కోసం రూ.10కోట్లు, ఆదిలాబాద్ రిమ్స్ పరిధిలో కొత్తగా నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు రూ.20కోట్లు, మంచిర్యాల జిల్లా చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం 30నుంచి వంద పడకల అప్‌గ్రేడ్ కోసం రూ.10కోట్లు రుణ మంజూరుకు కేంద్రం ఆమోదించింది. నిర్మల్ పట్టణంలో జాతీయ రహదారి 61నుంచి సింగిల్ రోడ్డును నాలుగు వరసలుగా మార్చి, ఎల్లపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వరకు రోడ్డు విస్తరించి నిర్మించేందుకు రూ.27.57కోట్లు, ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి దాకా, వయా అంకోలి, వాన్వట్, పిప్పల్‌ధరి, కందాల, చిచ్‌ధరి, మీదుగా బుర్నస్‌పటార్ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.5.79కోట్లు రుణ మంజూరుకు కేంద్రం ఆమోదించింది. మొత్తంగా స్పెషల్ అసిస్టెన్స్ లోన్ కింద ఉమ్మడి జిల్లాకు ఆమోదించిన రూ.82.86కోట్ల ఈ మూలధన వ్యయంతో వైద్య, రోడ్డు రవాణా పరంగా అభివృద్ధి జరిగే అవకాశం ఉంది.

పరారీలోని దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య వివరాల ప్రకారం... బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి ధనలక్ష్మి, తాళ్లపల్లి ప్రసాద్ భార్యభర్తలు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రిపూట ఇనుపరాడ్‌తో చాకచక్యంగా తాళం పగులగొట్టి దొంగతనాలకు పాల్పడటం వృత్తిగా పెట్టుకున్నాడు. ధనలక్ష్మి గత ఏప్రిల్ 29న బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి పక్కన ఉన్న క్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆమెను అదుపులోకి తీసుకుని విచారించారు. ధనలక్ష్మిపై కేసు నమోదు చేసి రెండు నెలల క్రితం కోర్టుకు పంపించారు. ఆమె భర్త ప్రసాద్ పరారీలో ఉన్నాడు. మంగళవారం రాత్రి ప్రసాద్‌ను బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌వద్ద పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు.

భూ వివాదంలో ఇద్దరి దారుణ హత్య

- 13 మంది నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ నరేందర్, ఎస్సై భూమేశ్



అరెస్టు చూపిస్తున్న సీఐ నరేందర్, ఎస్సై భూమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): భూవివాదంలో ఇద్దరిని హత్య చేసిన 13 మందిని పట్టుకున్నట్లు సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్ వెల్లడించారు. వారి వివరాల ప్రకారం... గత సోమవారం జక్కులపెల్లి శివారులోని వ్యవసాయ భూమి విషయంలో మండల బక్కయ్య కుటుంబీలకు, మండల మెంగయ్య కుటుంబీలకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత ఆదివారం బక్కయ్య కుటుంబ సభ్యులు అదే భూమిలో పత్తి విత్తనాలు వేశారు. విషయం తెలుసుకున్న మెంగయ్యతో పాటు అతడి కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం కత్తులు, గొడ్డళ్లు, రాళ్లు, కారంపొడితో భూమి వద్దకు వెళ్లారు. వారి రాకకు గమనించి బక్కయ్య అడ్డుకునే ప్రయత్నం చేశాడు. వారు వెంట తెచ్చుకున్న కర్రలు, కత్తులు, గొడ్డళ్లతో దాడి చేయగా బక్కయ్య కుమారుడు మండల నర్సయ్యతో పాటు అతడి సోదరి గిరుగుల బక్కక్క అక్కడికక్కడే మృతి చెందారు. మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. మండల ఇందిరా ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నాలుగు బృందాలతో ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి పరారీలోని 13మందిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి ఉపయోగించిన మూడు గొడ్డళ్లు, రెండు కత్తులు, నాలుగు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. మండల మల్లేష్, మండల గణేష్, మండల వెంకటేష్, గిరుగుల భీంరావు, గిరుగుల రాకేష్, మండల రంగక్క, గిరుగుల రజిత, మండల రజిత, మండల రుక్మ, రాటే భూమక్క, రాటే భూదయ్య, గిరుగుల దుర్గక్క, గిరుగుల సొమ్మలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ వీధిలో నివాసముంటున్న న్యాయవాది, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు ఇంట్లోని స్టోర్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. సతీశ్‌బాబు దంపతులు నాలుగు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే వారి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పివేశారు.